# తప్పు లేని శిక్ష

అప్పుడే భోజనం ముగించి ఆఫీసుకు బయలుదేరాను. ఎదురింటి విశ్వనాథం వాళ్ళగుమ్మంలో నిలుచుని వున్నాడు. మేం యిద్దరం ఆఫీసుకు పోయేవేళ అదేను. ఒకరికోసం మరొకరు నిరీక్షించవలసిందే. అది మా నియమం.

ఇద్దరం వీధిలోకి వచ్చాం. మాటా మంతీ ఆడుకుంటూ నడుస్తున్నాం. కాస్తంతదూరంలో సుబ్రహ్మణ్యాం అగుపించాడు.

అతణ్ణి చూడ్డంతోనే విశ్వనాథం ప్రసంగం కట్టిపెట్టాడు.

"ఒరేయ్ రామం! అదిగో సుబ్రహ్మణ్యాం వస్తున్నాడు. ఈయన ఎదురయ్యాడంటే యికచూడూ, యీవేళ మనకు కాఫీ చుక్కయినా దొరకవు" అన్నాడు.

వాడి సిద్ధాంతంలోని సత్యం ఏమిటో నాకు ఒక పాళాన అర్థం కావడంలేదు. సుబ్రహ్మణ్యాం ముఖంలో ఏం ప్రత్యేకత వుందని విశ్వనాథం యిలా అంటున్నాడో నాకు బోధపడలేదు.

"అదేమిట్రా! నీ సిద్ధాంతం ఆశ్చర్యంగావుందే! అల్లాంటి అనుభవం నీ కెప్పుడైనా కలిగిందా ఏమిటి?" అన్నాను.

"నా ఒక్కడికే అన్నమాట ఏమిట్రా? ఎవర్నయినా ఈ వీధిలో వాళ్ళని అడుగు, అదే చెప్తారు."

నాకు ఆశ్చర్యం కలిగింది. ఆ వచనాలు నా మెదడులో గిర్రున తిరిగాయి. ఈ అణుయుగంలో కూడా యిట్లాంటి పిచ్చి నమ్మకాలు కూడా వున్నాయా, అనిపించింది.

సుబ్రహ్మణ్యం దగ్గరగా వచ్చాడు, కాస్త ముఖపరిచయం వుంది కాబట్టి.

"నమస్కారమండీ! సుబ్రహ్మణ్యంగారూ!" అన్నాను. పెద్దవాడు. ఆపాటి గౌరవం యివ్వకపోతే బావుంటుందా?

సుబ్రహ్మణ్యం ఆగిపోతూ నమస్కారం అన్నాడు. "నువ్వు ధైర్యంచేసి నాతో మాట్లాడుతున్నందుకు నాకెంతో ఆనందంగావుంది. రామారావ్! నాతో మాట్లాడ్డానికే కాదు కదా, కనీసం నన్ను చూడడానికే చాలామంది భయపడి తల్లడిల్లి పోతారు. నేనో బ్రహ్మరాక్షసుడిలా అగుపిస్తానో, లేక నా మొహంలో వాళ్ళందరికీ శనిదేవత సాక్షాత్కరిస్తుందో నాకు మాత్రం తెలీదు. ఎంతో అవసరమయితేకానీ, కొందరు నా ముందుకి రారు. ఎవరో నీలాంటి మొండిఘటాలు ధైర్యంచేసి వస్తారనుకో. ఇదంతా నేను పూర్వజన్మలో చేసుకున్న పాపమేమో." అంటూ బాధగా ముగించాడు.

మనసులో పడుతున్న వ్యధనంతా వెల్లడి చేశాడు సుబ్రహ్మణ్యం. నిజంగా అతనిమీద నాకు చాలా జాలివేసింది. ఒకమనిషిని బాధపెట్టాలంటే ఒకనిముషం పట్టదు. ఒక వ్యక్తికి పిచ్చెత్తాలంటే అరనిముషం పట్టదు. ఒకరిని సంతృప్తి పరచడం, సహాయం చెయ్యటం ఒక్కరికీ చేతకాదు. ఇదే ప్రపంచంలోని

పరమ విచిత్రమైన సత్యం. సుబ్రహ్మణ్యాన్ని కొన్నాళ్లు పోయాక, పిచ్చివానిలా తయారు చేస్తుందేమో యీ ప్రపంచం! అనుకున్నాను.

"మీరలా బాధపడకండి సుబ్రహ్మణ్యంగారూ! ఎవరో ఏదో అనుకుంటే మీకేం? ఎవర్నీ లెక్కచేయకండా తిరగండి" సలహా యిచ్చాను.

సలహాలు యివ్వడమయితే సులువేకాని. వాటిని ఆచరించేవాళ్ళకి అందులోని కష్టం బోధపడుతుంది.

"నీకు తెలీదు రామారావ్. నువ్వింకా వయసులో చిన్నవాడివి. లోకంతీరు పూర్తిగా తెలీదు. సంఘంలో నలుగురి మధ్య బ్రతుకుతున్నవాణ్ణి. ఎలా లెక్కచెయ్యకుండా వుండ గలను? ఇంతెందుకు? ఆప్యాయంగా పలకరించావా? నీ ప్రక్కనే వున్న విశ్వనాథం చూడు, వెనక్కు మొహం త్రిప్పుకుని నుంచున్నాడు. నా నీడకూడా తనమీద పడకూడదని వుద్దేశం గామోసు." అన్నాడు, సుబ్రహ్మణ్యం.

విశ్వనాథం తత్తరపాటు పడ్డాడు.

"అబ్బే అలాంటి వుద్దేశ్యమే నాకు లేదండీ" అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. మనిషి పరోక్షంలో సవాలక్ష చెప్తాం. లెక్కలేనన్ని విమర్శలు విసురుతాం. కానీ ప్రత్యక్షంలో పల్లెత్తుమాట అదీ వున్న విషయమైనాసరే అనడానికి ధైర్యం చాలదు. ఇదీ యిప్పటి నాగరికుల అవస్థ.

"సరేలే అబ్బాయ్ : యేం చేస్తాను ? యిది నా ఖర్మ. నే నెవ్వరికీ అపకారం చెయ్యలేదు. నోరెత్తి తిట్టలేదు. చెయ్యెత్తి కొట్టలేదు. ఎందుకోమరి నామీద యీ ద్వేషం ! రామూరావ్, నువ్వే నా పరిస్థితిలోవుంటే, యెలా ఫీలవుతావో, యెంతయాతన అనుభవిస్తావో, కాస్త ఆత్మవిమర్శ చేసుకో! నిన్నంటే నిన్నే కాదు. నేనీ ప్రశ్న అడిగేది. ప్రతి ఒక్కరినీ. నాకు డబ్బు అవసరమైతే యెవర్నయినా అప్పు అడిగేందుకుకూడా నాకు ధైర్యం చాలదు. అడిగినా యివ్వరు సరికదా, పై పెచ్చు కొందరు విసుక్కుని లోలోపల తిట్టుకుంటారు. ఈ శిక్ష నాకెందుకు చెప్పు ? తప్పు లేకుండా సంఘం నన్ను శిక్షిస్తోంది. అందరితో బాటు చదువుకుని నాగరికతను ఆకళింపు చేసుకుని మీలాంటి వాళ్లుకూడా యిలా ప్రవర్తిస్తే, నేనెలా జీవించేది ? క్రమంగా నాలో మనశ్శాంతి క్షీణిస్తూంది. అందుకే యీ వూరికిదూరంగా బదిలీ చేయించుకుంటున్నాను. ఏం చెయ్యను ? నా దురదృష్టానికి నేను విచారించాలి. ఎవర్నని ఏం లాభం ? వస్తాను మరి" అంటూ భారంగా ముందుకు సాగిపోయాడు, సుబ్రహ్మణ్యం.

సుబ్రహ్మణ్యం కళ్ళల్లో నీరు గిర్రున తిరగటం నాకు స్పష్టంగా అగుపించింది. అతనిపై అమితంగా జాలి పుట్టింది. అతను పోతున్న వేపే చూస్తూ, శిలా ప్రతిమలా నిశ్చలంగా నిల్చుండి పోయాను.

"పదరా! ఆఫీసుకు వేళవుతూంది. ఇప్పటికే నిర్ణీత సమయం మీరిపోయింది", అన్నాడు విశ్వనాథం.

ముందుకు సాగిపోయాం.

"చూడరా విశ్వం—ఆయన ఎంతగా బాధపడుతున్నాడో పాపం! అందరూకలిసి అతణ్ణి పిచ్చెక్కించేట్టున్నారు" అన్నాను.

విశ్వనాథం చిన్నగా నవ్వాడు.

"నువ్వెన్నాళ్ళుగా ఆదుకోడానికి?" ఎగతాళిగా అన్నాడు.

వాడిమీద చెప్పలేనంత కోపం ముంచుకొచ్చింది.

"అతణ్ణి చూస్తే నీకు ఎగతాళిగా వుందట్రా? నువ్వే ఆ స్థానంలో వుంటావనుకో! నిన్నే అతణ్ణి హింసిస్తున్నట్లు, అందరూ హింసిస్తారనుకో. ఎవరూ నీతో మాట్లాడ్డానికి ముందుకు రారు. కానీ అవసరమంటే అప్పిచ్చేదాత అగుపించడు. నువ్వు కష్టాలలోవుంటే ధైర్యం చెప్పేవాళ్ళు కూడా ఎవరూ వుండరు. అప్పుడు నువ్వెంతగా కుమిలిపోతావో ఆలోచించు! అరణ్యంలో జీవితానికీ, ఆ జీవితానికీ, యెన్నడన్నా వ్యత్యాసముంటుందేమో వూహించుకో! మరొకరి బాధను మన బాధేనని అనుభవిస్తే ఎలావుంటుందోనని పోల్చిచూసుకుంటే యిప్పుడు సుబ్రహ్మణ్యం పొందుతున్న వ్యథ అర్థమవుతుందిరా! ఇంతకీ అతణ్ణి ఎందుకల్లా దూరంగా వుంచుతున్నారో అవగాహన కావడంలేదురా" అన్నాను కసిగా.

విశ్వనాథం మందహాసం చేశాడు మెల్లగా. "నీకు అర్థమయింది అతి స్వల్పంరా యీ విషయంలో. కాని ఆవేశం మాత్రం తెగబారెడుంది. చూడు, ఇవాళ నీకు నిదర్శనం అగు

పిస్తుంది." ఛాలెంజీ చేసినట్లుగా తనో నగ్నసత్యాన్ని త్వరితంలో నిరూపిస్తున్నట్లుగా అన్నాడు.

నేను నవ్వుకున్నాను. నిదర్శన మేమిటి? నాకు చూడాలని కుతూహలంగా వుంది. అందుకే ఆ ప్రసక్తికి స్వస్తిచెప్పి చకచకా సాగిపోయాం.

ఆఫీసులో అడుగుపెట్టేసరికి పదిన్నర అయ్యింది. అంత ఆలస్యంగా వెళ్ళినందుకు మా సూపర్‌వైజర్ యిద్దరికీ చీవాట్లు పెట్టాడు.

చీవాట్లు తిన్నందుకు బాధ లేకపోగా విజయోత్సాహంతో నవ్వాడు విశ్వనాథం.

"ఇప్పుడు నిదర్శనం కనుపించిందా? నాతో ఏకీభవించక తప్పదనుకుంటాను." అన్నాడు.

"ఏ విషయం ఏకీభవించడం?" అన్నాను, ఏమీ అర్థంకానట్లు.

"సుబ్రహ్మణ్యం విషయంలో. ఆ మహానుభావుడు యెదురవ్వటం ఎలాంటి ఫలితాన్ని యిచ్చిందో ప్రత్యక్షంగా తెలుసుకున్నావుగా? లేకపోతే ఎప్పుడూ చీవాట్లు తినని మనం యీారోజు చడామడా చీవాట్లు తినడమేమిటి? వూరికనే ఎవరూ అనర్రా బ్రదర్" గర్వంగా అన్నాడు.

అప్రయత్నంగా నాకు నవ్వొచ్చింది. "నీ అభిప్రాయం తప్పురా తమ్ముడూ! మనం అరగంట ఆలస్యంగా వచ్చాం.

ఆలస్యంగా వచ్చామన్న విషయం మనకు తెలుసు. చీవాట్లు తింటామనికూడా తెలుసు. అది నగ్నసత్యం. తెలిసినవిషయానికి మరొక అమాయకుణ్ణి బాధ్యుడిగా చేయటం అన్యాయం. ఈవేళ నాకు శుభవార్త వచ్చింది. ఆ శుభవార్త ఆయన యెదురవ్వడం మూలంగా వచ్చిందని ఎందుకనుకోకూడదు? అది శుభవార్త కనుక అతనితో ప్రమేయముండదా? మనకి చెడు సంభవిస్తే, అతను బాధ్యుడవుతాడు. శుభం సంఘటిల్లితే అది కేవలం మన ప్రజ్ఞ, మన అదృష్టముకదూ! ఇది బావుందిరా!! ”అన్నాను.

విశ్వనాథం వెటకారంగా నవ్వాడు. “నీతో వాదనేమిటిలే మొండివాదన” అనేసి తన సీట్లోకిపోయి కూర్చున్నాడు.

ఔను! నిజంచెప్తే మొండివాదనల్లానే వుంటాయనుకుని నాసీట్లో కూలబడ్డాను. సుబ్రహ్మణ్యంమాత్రం దీనవదనంతో నా దృష్టిలో మెదులుతూనే వున్నాడు.